వెంకటాపూర్ : రామప్పలో దైవ దర్శనానికి క్యూలో విద్యార్థులు, భక్తులు

కాళేశ్వరం : అభిషేక పూజలు చేస్తున్న భక్తులు

ఆలయాల్లో సండే సందడి

- కాళేశ్వరం, రామప్ప, మల్లూరుకు పోటెత్తిన భక్తులు
- వరుస సెలవులతో తరలివచ్చిన సందర్శకులు

కాళేశ్వరం, డిసెంబర్ 24 : దక్షిణ కాశీగా పేరొందిన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. త్రివేణి సంగమంలోని గోదావరి పుష్కరఘాట్ వద్ద భక్తులు స్నానాలాచరించి నదీ మాతకు దీపాలు వదిలి, సైకత లింగాలను పూజించారు. అక్కడి నుంచి ఆలయానికి వచ్చి కొందరు కాలసర్ప, శని పూజలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వివిధ పూజల ద్వారా సుమారు రూ. 5.20 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

రామప్పలో..

వెంకటాపూర్ : మండలంలోని రామప్ప ఆలయం ఆదివారంతో పాటు క్రిస్మస్ సెలవుల నేపథ్యంలో పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. వివిధ రాష్ట్రాల నుంచి 20 వేల మందికి పైగా పర్యాటకులు సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించగా పర్యాటకులు ఆసక్తిగా విన్నారు. అనంతరం రామప్ప సరస్సుకు చేరుకొని బోటింగ్ చేశారు.

మల్లూరులో..

మంగపేట : మండలంలోని మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సిరిసిల్ల జడ్పీ సీఈవో గౌతంరెడ్డి కుటుంబ సమేతంగా స్వామి వారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ ముకుందం, అర్చకులు వారికి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఎంపీడీవో శ్రీధర్, పలువురు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

మంగపేట : స్వామిని దర్శించుకున్న సిరిసిల్ల జడ్పీ సీఈవో

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో చేసిన అభివృద్ధిపై స్వేదపత్రం పేరుతో హైదరాబాద్ తెలంగాణ భవన్ (బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం)లో ఆదివారం కేటీఆర్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను టీవీలో తిలకిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి. భూపాలపల్లిలో కేటీఆర్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను టీవీలో తిలకిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

లక్నవరంలో పర్యాటకుల కోలాహలం

పెద్ద బోటులో షికారు చేస్తున్న పర్యాటకులు

గోవిందరావుపేట, డిసెంబర్ 24 : మండ లంలోని లక్నవరం ప ర్యాటకులతో కోలాహలంగా మారింది. ఆదివారంతో పాటు క్రిస్మస్ సెలవులు రావడంతో పర్యాటకులు సుదూర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చి లక్నవరం అందాలను తిలకించారు. మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని తిరుగు ప్రయాణంలో లక్నవరం సదర్శనకు విచ్చేసి, సరస్సు అందాలకు మంత్రముగ్ధులయ్యారు. సరస్సులో పెద్ద, చిన్న బోట్లలో షికారు చేసి ఆహ్లాదంగా గడిపారు.

నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

మల్హర్ (కాటారం), డిసెంబర్ 24: ఐటీ, శాసనసభా వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం కాటారం మండలంలో పర్యటించనున్నారు. గంగారం క్రాస్ నుంచి గారెపల్లి వరకు నిర్వహించే బైక్ ర్యాలీలో పాల్గొననున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

మేడారానికి ప్రత్యేక జీవో తీసుకురావాలి

తాడ్వాయి, డిసెంబర్ 24 : మేడారం సమ్మక్క-సారలమ్మల మహాజాతర నిర్వహణకు ఏర్పాటు చేసే ట్రస్ట్‌బోర్డు పూర్తి ఆదివాసీలతో ఏర్పాటు చేసేలా ప్రభుత్వం నూతన జీవో తీసుకురావాలని పలు ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని మేడారంలో సర్పంచ్ బాబురావు ఆధ్వర్యంలో ఏకీకరణ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ ఆదివాసీల సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు పొడెం రత్నం, బాబు, నాగేశ్వర్‌రావు, సుదాకర్, కృష్ణ, రవి, సాయిబాబా, సురేందర్, రాజు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 24: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. లోప భూయిష్టంగా ఉన్న 317జీవోను సవరించాలని, ఉపాధ్యాయ సంఘాలతో ముఖ్యమంత్రి స్వయంగా విద్యారంగ సమస్యలపై సమీక్షించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకురాలు రమాదేవి

రౌడీషీట్ ఎత్తివేయాలి

మహాముత్తారం, డిసెంబర్ 24: బీఆర్ఎస్ నాయకులపై రౌడీ షీట్ ఎత్తివేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు లింగమల్ల రమాదేవి కోరారు. ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ జడ్పీటీసీ మండల రాజిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అనిల్‌రెడ్డిపై పోలీసులు కక్షపూరితంగా రౌడీ షీట్ ఓపెన్ చేశారని తెలిపారు. తక్షణమే వారిపై రౌడీషీట్‌ను ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. సమావేశంలో బొత్ సుజాత, పాగే స్వర్ణలత, కస్తూరి లక్ష్మి పాల్గొన్నారు.


రవిని సన్మానిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఏఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

తాడ్వాయి, డిసెంబర్ 24: ఆదివాసీ విద్యార్థి సంఘం (ఏఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన కొప్పుల రవిని తుడుందెబ్బ నాయకులు ఆదివారం సన్మానించారు. మేడారానికి వచ్చిన ఆయనకు తుడుందెబ్బ జిల్లా, రాష్ట్ర నాయకులు ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చిడం బాబురావు, సునీల్, స్వామి, బాల కృష్ణ, శోభన్, జగన్, లక్ష్మణ్‌రావు, కోటి, రవి ఉన్నారు.

కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

పోలీసుల ముమ్మర తనిఖీలు

వెంకటాపురం (నూగూరు) డిసెంబర్ 24 : వెంకటాపురం నూగూరు మండలంలోని యాకన్నగూడెం సమీపంలో ఎస్సై రేఖా అశోక్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలతో ముమ్మరంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించారు.

కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

ప్రారంభమైన ట్రస్మా క్రీడలు

వెంకటాపూర్, డిసెంబర్ 24 : మండల కేంద్రంలోని వేదవ్యాస పాఠశాలలో జిల్లా స్థాయి ప్రైవేట్ పాఠశాలల (ట్రస్మా) విద్యార్థులకు క్రీడా పోటీలు జిల్లా ట్రస్మా అధ్యక్షుడు పోశాల వీరమల్లు ఆధ్వర్యంలో ప్రారంభించారు. జిల్లాలోని 30 ప్రైవేట్ పాఠశాలల బాలబాలికలకు ఇంటర్ స్కూల్ గేమ్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, క్రికెట్, చెస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ ఎం అశోక్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ రావు, కోశాధికారి సురేందర్‌రెడ్డి, క్రీడల కన్వీనర్ కోటిరెడ్డి, రాజయ్య, సూర్యప్రకాశ్ రెడ్డి, మోహన్‌రావు, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 24: ఆరు గ్యారెంటీల ను అమలు చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని అం బేద్కర్ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం ఐఎన్‌టీయూసీ భూపాలపల్లి బ్రాంచి ఉపాధ్యక్షుడు భిక్షపతి ఆధ్వర్యంలో సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై మాట్లాడారు. ఆరు గ్యారెంటీలతో కూడిన మ్యానిఫెస్టోను సింగరేణి కార్మికులకు అమలు చేస్తామని తెలిపారు. భూపాలపల్లి సింగరేణి కార్మికుల అభివృద్ధి కోసం సేవకుడిగా పనిచేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్, ఐఎన్‌టీయూసీ నాయకులు, సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

కృష్ణకాలనీ : వేడుకలకు ముస్తాబైన భూపాలపల్లి సుభాష్‌కాలనీలోని బెతెస్తే ప్రార్థమందిరం

గోవిందరావుపేట : విద్యుత్ దీపాలతో అలంకరించిన మండల కేంద్రలోని చర్చి

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు

కృష్ణకాలనీ, డిసెంబర్ 24: క్రిస్మస్ పండుగ సందర్భంగా జయశంకర్ జిల్లా కేంద్రంలోని చర్చిలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. రెడ్డికాలనీలోని సీఎస్ చర్చి, కల్వరి చర్చి, కల్వరి ప్రేమ మినిస్ట్రీ, సియోను ప్రార్థనమందిరం, బేతేస్థ కల్వరి మందిరం, మంజూర్‌నగర్‌లోని సీయోను ప్రార్థన మందిరంతోపాటు అన్ని చర్చిలను సుందరంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా కేక్‌కట్ చేయడానికి చర్చి లోపల ప్రత్యేక స్టేజీలు ఏర్పాటు చేశారు.

గోవిందరావుపేటలో..

గోవిందరావుపేట : నేడు నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు ఆయా గ్రామాల్లోని చర్చిలు ముస్తాబయ్యాయి. గోవిందరావుపేట, చల్వాయి, పస్రా, మచ్చాపూర్ గ్రామాల్లోని చర్చిలకు క్రైస్తవులు విద్యుత్ కాంతులు విరజిమ్మేలా లైటింగ్‌లను ఏర్పాట్లు చేశారు.

కృష్ణకాలనీ : కల్వరి సియోను చర్చి

బియ్యం అందజేత

గణపురం, డిసెంబర్ 24: మండల కేంద్రంలోని కోటగుళ్ల పరిరక్షణ కమిటీ సభ్యుడు బైరపాక వెంకటేశ్ ఇటీవల మృతిచెందగా, అతడి తల్లిదండ్రులు బైరపాక సుగుణ, సాంబయ్యకు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం క్వింటాల్ బియ్యం అందజేశారు. కమిటీ సభ్యులు నాగపూరి శ్రీనివాస్‌గౌడ్, సామర్ల నాగరాజు, కొయ్యల గౌతమ్, తోట నవీన్ కుమార్, అరెల్లి ఓంకార్, పుప్పాల శివ, మదం అనిల్, గణేశ్ పాల్గొన్నారు.

బియ్యం అందజేస్తున్న కమిటీ సభ్యులు


క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు అందజేస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకోవాలి

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్

ములుగు రూరల్, డిసెంబర్ 24: క్రైస్తవులు క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో క్రిస్మస్ గిఫ్ట్ ప్యాక్‌లను పంపిణీ చేశారు. ముందుగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రైస్తవులకు పండుగ కానుకగా బట్టలను అందించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం వేయి గిఫ్ట్ ప్యాకెట్లను సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవులు, మైనార్టీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ వల్లే ఉద్యోగాలు వచ్చాయి

- భూపాలపల్లి ఏరియాలో టీబీజీకేఎస్‌ను గెలిపించుకుంటాం
- వారసత్వ ఉద్యోగాలు పొందిన కార్మికులు

మాట్లాడుతున్న వారసత్వ ఉద్యోగాలు పొందిన కార్మికులు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 24: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తమకు ఉద్యోగాలు వచ్చాయని సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు పొందిన కార్మికులు తెలిపారు. వారు ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారసత్వ ఉద్యోగాలను గతంలో జాతీయ సంఘాలు పోగొట్టాయని తెలిపారు. దీంతో చాలామంది రోడ్డున పడ్డారని పేర్కొన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక వారసత్వ ఉద్యోగాలు ఇవ్వడంతో తాము పొంది సమాజంలో తలెత్తుకొని బతుకుతున్నామని తెలిపారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో భూపాలపల్లి ఏరియాలో టీబీజీకేఎస్‌ను గెలిపించుకుంటామన్నారు. బ్రాంచి నాయకులు నరేశ్, తాళ్లపెల్లి శశికాంత్‌గౌడ్, కాగితపు సురేశ్, రమేశ్‌యాదవ్, తిక్క తిరుపతి, లక్ష్మణ్, కిరణ్, రామారావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా ఉద్యోగుల ఎంపిక

మల్హర్, డిసెంబర్ 24: ఆల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తమ మహిళా ఉద్యోగులను ఎంపిక చేసినట్లు ఎంపిక కమిటీ సభ్యుడు జాతీయ మానవ హక్కుల మండలి మండల అధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు బండి సుధాకర్ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కాళేశ్వరం జోన్ మల్హర్ మండలంలో వివిధ శాఖలకు చెందిన 20 మందిని ఉత్తమ మహిళా ఉద్యోగులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కొ య్యూర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుళ్లు సుధారాణి, రోజా, సౌజ న్య, శిరీష, రమాదేవి, వ్యవసాయశాఖ నుంచి ఏఈఓలు శిరీష, మనీషా, అనూష, ఐసీడీఎస్ నుంచి అంగన్‌వాడీ టీచర్లు పద్మ, అన్నపూర్ణ, రమాదేవి, పంచాయతీ కార్యదర్శులు సరితా, వెన్నెల, సునీత, ఆరోగ్యశాఖ నుంచి ఏఎన్ఎంలు సరిత, సాధన, రాజేశ్వ రి, అటవీ శాఖ నుంచి బీట్ అధికారులు వనజ, పద్మ, పంచాయతీరాజ్ నుంచి పారిశుద్ధ్య కార్మికురాలు అక్కపాక ఓదెమ్మ ఎంపికైనట్లు వివరించారు. వీరికి జనవరి 3న సావిత్రీబాయి పూలే 194వ జయంతిని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమర్‌చంద్ కల్యాణ మండపం జెండా చౌరస్తాలో ప్రశంసా పత్రా లు, మెమెంటోలు అందజేయనున్నట్లు తెలిపారు.

బిల్లు మంజూరు చేయాలని ధర్నా

- మూడు ఇండ్ల తాళాలు పగులగొట్టిన దుండగులు
- రెండు ఇండ్లలో చోరీకి యత్నం
- హైదరాబాద్‌కు వెళ్లిన బాధిత కుటుంబ సభ్యులు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కలెక్టర్ బూట్లు మోసిన అటెండర్!

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చర్చిలో ఘటన

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 24: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్ కల్వరి చర్చిలో శనివారం జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి టీ శైలజ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథులుగా కలెక్టర్ భవేశ్‌మిశ్రా, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ షూస్ తీయకుండానే వేదికపైకి ఎక్కారు. ఆ తర్వాత విషయాన్ని గ్రహించిన కలెక్టర్ షూస్ తీసి తాను కూర్చున్న సోఫా వెనుకవైపెట్టారు. వాటిని ఆఫీస్ సబార్డినేట్ షూస్‌ను అక్కడి తీసి నుంచి ఓ మూలకు పెట్టాడు. కార్యక్రమం పూర్తయ్యాక షూస్‌ను ఆఫీస్ సబార్డినేట్ తీసుకువచ్చి కలెక్టర్‌కు అందజేయగా వేసుకున్నారు. దీంతో కలెక్టర్ బూట్లు మోసిన అటెండర్ అంటూ కథనాలు వచ్చాయి.

బూట్లు అటెండర్‌తో తెప్పించుకోలే : కలెక్టర్ భవేశ్ మిశ్రా

'అటెండర్ చేతికి బూట్లు' విషయంపై పలు పత్రికల్లో వచ్చిన కథనంపై కలెక్టర్ భవేశ్‌మిశ్రా ఆదివారం సాయంత్రం స్పందించారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్ కల్వరి చర్చిలో క్రిస్మస్ వేడుకలు జరగ్గా రాష్ట్ర ప్రభుత్వ కానుకలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాను పాల్గొని వేదికపై కూర్చొని వెంటనే షూస్ విప్పి సోఫా వెనుక పెట్టానన్నారు. కానీ కార్యక్రమంలో ఎక్కువ మంది పాల్గొనగా ఆఫీస్ సబార్డినేట్ షూస్‌ని అక్కడి నుంచి తీసి మరోచోట పెట్టారని తెలిపారు. అంతే కానీ సిబ్బంది ద్వారా షూస్‌ని తెప్పించుకోలేదని ఓ ప్రకటనలో వివరించారు.

పెన్షనర్లకు ఐటీ మినహాయించాలి

కృష్ణకాలనీ, డిసెంబర్ 24: పెన్షనర్లకు ఆదాయ పన్ను మినహాయించాలని తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ పెన్షనర్ల అసోసియేషన్ జయశంకర్ జిల్లా అధ్యక్షుడు కట్ట రామచంద్రమూర్తి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతినెలా 1న పెన్షన్లు అందించాలని కోరారు. 5శాతం ఉన్న ఐఆర్‌ను 15శాతానికి పెంచాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే అమలు చేయాలన్నారు. జీపీఎఫ్, టీఎస్‌జీఎల్‌ఐఎఫ్ వంటి పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల అయిలయ్య, నాయకులు బండి రాజమౌళి, దన్‌సింగ్, అంకన్న, రామారావు పాల్గొన్నారు.

ఒడితలలో రూ. 2 లక్షల నగదు చోరీ

- మూడు ఇండ్ల తాళాలు పగులగొట్టిన దుండగులు
- రెండు ఇండ్లలో చోరీకి యత్నం
- హైదరాబాద్‌కు వెళ్లిన బాధిత కుటుంబ సభ్యులు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

చిట్యాల, డిసెంబర్ 24 : మండలంలోని ఒడితల గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి రూ. 2 లక్షల నగదు చోరీకి పాల్పడ్డారు. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఏరుకొండ శంకర్, కందుకూరి వెంకటయ్య కుటుంబ సభ్యులు శనివారం వ్యవసాయ పనులకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు వారి ఇండ్ల తాళాలు పగులగొట్టి లోపల చొరబడగా ఏమీ లభించలేదు. ఇదే గ్రామానికి చెందిన కిరాణా షాపు యజమాని నేరెళ్ల సారంగపాణి రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌కు వెళ్లాడు. దుండగులు కిరాణా షాపు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. తలుపులు తెరిచి ఉండగా ఆదివారం కోతులు వెళ్లి కిరాణా వస్తువులను చిందరవందర చేస్తుండడం గమనించిన స్థానికులు అతడికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు స్థానికులతో ఫోన్‌లో మాట్లాడి రూ.2లక్ష ల నగదు పెట్టిన చోట లేవని తెలుసుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై-2 ఎండీ షాఖాన్ ప రిశీలించారు. కిరాణా షాపులో బంగారం లభించిందని, నగదు చోరీకి గురైందని ఆయన తెలిపారు. బాధితుడు చేరుకున్నాక ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్సై వెల్లడించారు.

రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ గౌష్ ఆలం, జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ కిరణ్ ఖరే.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Computer Operators, GNM Nurses, OT-Technicians & Compounders. Cont: Guardian Hospital, Opp: L.B. College, Warangal. Time: 12pm to 2 pm.
NTW-0325

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073.
NT-314383

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565